# నాగులు

- మేరెడ్డి యాదగిరిరెడ్డి

ఊరి బయట చెరువు వార ఓ పాతిక దాకా బిచ్చగాండ్ల గుడిశెలు. వాళ్ల కోళ్ల, కుక్కల, గాడిదల అరుపులు. చిన్న పిల్లల ఏడ్పులు. ఆ ఉదయం పూట ఒకటే సందడి. గుడిశెల ముందు పొయ్యి ముందు ఆడవాళ్ల పాట్లు. తడిసిన కట్టెలు మండక ఒకటే పొగ. వారం రోజుల తుఫాను వెలిసి ఈ రోజే కాస్త తెరిపిచ్చింది. మబ్బుల మాటు నుండి సూర్యుడు బయటకు వచ్చాడు. వారం రోజుల ముసురు వర్షంతో వాళ్ల బతుకులు అతలాకుతలమయ్యాయి. ఊర్లోకి పోతేనే పూట గడవని వాళ్లు వాన పుణ్యమా అని గుడిశె దాటలేదు. గుడిశెల్లో వున్నకాడికి బియ్యం, నూకలు, సజ్జలు, జొన్నలు అయిపుచ్చారు. గంజో గటకో తాగి పూట గడుపుకున్నారు. అర్ధాకలితో గడిపిన బిచ్చగాండ్లు యాచనకై వేషాలు కడుతున్నారు. హరిదాసులు, పిట్టలదొర, జంగందేవర, గోసంగి, బుర్రకథల వాళ్లు, చిలక జోస్యం వాళ్లు, ఎవరికి వచ్చిన విద్యలో వాటికి తగ్గ వేషాలు వేసుకుంటున్నారు. ముఖాలకు రంగులు, బొట్లు, కాళ్లకు గజ్జెలు కట్టుకుంటున్నారు. నిజానికి వాళ్లంతా బిచ్చగాండ్లు, పగటి వేషగాండ్లు. గతంలో గ్రామాలలో వీధి భాగవతాలు తోలుబొమ్మలాట లాడించిన బుడిగజంగాల వాళ్లు, నల్లగొండ దగ్గరి శేషమ్మగూడెం వాళ్లది. గ్రామగ్రామాన తిరిగి వందలకొద్దీ భాగవత నాటకాలు, తోలుబొమ్మలాడించి బాగా బతికిన వాళ్లే. కాలానుగుణంగా వచ్చిన సినిమాలు, టి.వి. సీరియళ్ళు వాళ్ల కళను మింగేశాయి. వాళ్ల నాటకాలు, తోలుబొమ్మలాటలు చూసే వాళ్లే కరువయ్యారు. గతంలో ఓ ఇరువయి నాటకాలు ఆడించిన ఊర్లల్లో ఒక్క నాటకానికి నోచుకోలేదు. తోలుబొమ్మలాట సరేసరి. వాళ్ల బొమ్మల పెట్టెలు, మద్దెల తాళాలు, హార్మోనియం ఎప్పుడో మూలన పడ్డాయి. పోటీలు పడి ఆడించిన పల్లెలు ఇపుడు వాళ్లను ఈసడించుకుంటున్నాయి. బ్రతుకుతెరువు కోసం ఇపుడు నానా వృత్తులు ఎంచుకున్నారు. పాత ఇనుము, ప్లాస్టిక్, పాత పేపర్ల వ్యాపారం, కప్పల వ్యాపారం కొంతకాలం చేశారు. కొంతమంది కళను చంపుకోలేని వాళ్లు ఓ హార్మోనీ పెట్టె, మద్దెల, తాళాలు తీసుకుని వేషాలు వేసుకుని పట్నాలలో దుకాణాల వెంట తిరిగి పాటలు, పద్యాలు పాడి పదీ పరకా అడుక్కుంటున్నారు. కొందరు ఇలా ఊర్ల మీద పడి తమకు వచ్చిన విద్యతో గడప గడప తిరిగి తమ విద్యలు చూపి, ఇన్ని బియ్యం, నూకలు, సజ్జలు, జొన్నలు, ఇంత అన్నం ఏది దొరికితే అది సంపాదించి పొట్ట నింపుకుంటున్నారు. ఏ ఊరికి పోయినా పదిమంది కలిసే వెడతారు. ఊరి బయట గుడిసెలు వేసుకుంటారు. ఓ పది రోజులుంటారు. ఎవరికి తోచిన వేషం వాళ్లు వేసుకుని పొట్టపోసు కుంటున్నారు.

ఈ వారం రోజుల ముసురులో కోటప్ప భార్య ప్రసవించింది. పండంటి మగపిల్లవాడు. తుఫాను ఈదురుగాలికి తట్టుకోలేక బాలింత రోగంతో పిల్లవాడు పుట్టిన మూడోరోజే హరీమంది. గుడిసెల వాళ్లు పదీ పరక వేసుకుని ఖర్మకాండ పూర్తిచేశారు. పసికందుది ఒకటే ఏడుపు. ఆ పిల్లవాణ్ణి ఎలా సాకాలో కోటప్పకు బోధపడలేదు. పక్క గుడిసెలోని చిన్నపిల్ల తల్లి రంగనాయకి ఓ నాలుగు రోజులు తన పిల్లవానితోపాటు ఈ పిల్లవానికి పాలిచ్చింది. ఈ రోజు నుండి నీ బాధ నీదే అని పిల్లవాణ్ణి కోటప్ప గుడిసెలో పడవేసి పోయింది. కోటప్ప భార్యను తలుచుకుని చాలాసేపు ఏడ్చాడు. ఆకలికి తట్టుకోలేని పిల్లవాడు ఒకటే ఏడుపు. కోటప్పకు ఏం తోచడం లేదు. పిల్లవాణ్ణి ఎలా సాకాలి, పాలెట్లా? ఇదే ఆలోచన. “ఒరేయ్ కోటప్పా! ఎన్ని రోజులు అలా ఏడుస్తూ కూచుంటావురా. నీకు ఎనకా ముందెవరున్నారు. ఎన్ని రోజులేడిస్తే పోయినోళ్లొస్తారురా. ఆ పిల్లగాని ముఖం చూడు. అలా ఊళ్లోకి పో. ఇంత అన్నం, ఇన్ని పాలు దొరకకపోవు. నారు పోసినవాడు, నీరు పొయ్యకపోడు లేలే” ఓ ముసలవ్వ వచ్చి ఓదార్చి చెప్పింది. కండ్లు తుడుచుకుని కోటప్ప వేషం కట్టాడు. ఓ పాత ధోవతి తీసుకుని ఉయ్యాల కట్టాడు. పిల్లవాణ్ణి అందులో వేసి నిద్రపుచ్చాడు. జోలె సంకకు వేసుకున్నాడు. జోలెలో ఓ గిన్నె, ఓ పాల సీసా వేసుకుని ఊర్లోకి బయలుదేరాడు. తన తోటి వాళ్లంతా ఎపుడో వెళ్లిపోయారు. నాలుగిండ్లు తిరిగేసరికి అన్నం గిన్నె నిండిపోయింది. మూడు రోజుల ఉపవాసం పేగులు లాగేస్తున్నాయి. ఊరి మధ్య ఓ బోరింగు దగ్గర చెట్టు క్రింద కూర్చుని గిన్నెడు అన్నం లాగించేశాడు. బోరింగు నీళ్లు తాగాడు. ప్రాణం కుదుటపడింది. అప్పటిగ్గానీ చంటోని ఏడుపు సంగతి గుర్తుకు రాలేదు. చంటోడికి పాలు లేకపోతే ఈ రాత్రికి వాడు బతుకుతాడా. సీసా పట్టుకుని ఊర్లోకి బయలుదేరాడు. “అమ్మా! తల్లీ! నా పెండ్లాం పురిటిలో సచ్చిపోయిందమ్మా! చంటోడికి పాలు లేవు తల్లీ! గిన్ని పాలు పోసి పుణ్యం కట్టుకోండి తల్లీ, పసిగందు పాణాలు రచ్చించండమ్మా!” గడప గడప తిరిగాడు. కోటప్ప మాటలు ఎవరూ నమ్మలేదు. ‘‘బయట దిరిగే ముండాకొడుకులు గంటకో వేషం వేస్తారు. ఇప్పుడే గిన్నెడు అన్నం పెట్టాం. బాగా మెక్కి ఇప్పుడో కొత్త నాటకం మొదలుపెట్టాడు. పెళ్లాం చచ్చిందనొకడు, ఇల్లు కాలిందని ఒకడు, తుఫాను వచ్చిందనొకడు. భూకంపమని ఒకడు... కష్టం చేయక, ఒళ్లొంచక దొంగ వేషాలు. పాలు కావాలట పాలు. అయ్యా! మీరు కొనిచ్చిన ఆవులు, బర్లు లేవు పాలుపోసేందుకు వెళ్లు... వెళ్లు... వెధవ వేషాలెయ్యకు...” తలా ఓ మాట తిట్టిపోశారు. తను ఎన్ని మాటలు చెప్పినా, ఏడ్చినా, మొత్తుకున్నా తన గోడు ఎవ్వరూ వినేట్టు లేరు. కాళ్లీడ్చుకుంటూ గుడిసె చేరుకున్నాడు. పిల్లవాడు ఒకటే ఏడుపు. అందరి గుడిసెల ముందర సందడే సందడి. తన భార్య లక్ష్మి వుంటే ఈపాటికి వండి వుంచేది. ఏదో ఓ కూర. పులుసు చేసి పెట్టేది. ఇద్దరూ కలిసి తినేవాళ్లు. మిగతా గుడిశెల్లో పెళ్లాం మొగుళ్ల సరససల్లాపాలు... పిల్లల కేరింతలు... కోటప్పకు దుఃఖం ముంచుకొచ్చింది. పిల్లవాణ్ణి భుజాన వేసుకున్నాడు. అటూ ఇటూ ఊపాడు. ఇన్ని నీళ్లు పట్టాడు. అయినా పిల్లవాని ఏడుపు ఆగలేదు. ఆ పసికందు ఆకలి కేకలు చప్పుడుకు చుట్టూ జనం కూడారు. ఓదార్చారు. ఎలా అయితే అలా అయిందని నిన్నా మొన్నా పాలిచ్చిన రంగనాయకమ్మ గుడిసె దగ్గరకు పోయాడు. “అక్కా! ఈ ఒక్క పూట గుక్కెడు పాలియ్యక్కా. రేపట్నించి ఎలాగయినా పాలు సంపాయిత్తాను.”

“చూడు కోటన్నా! ఏదో రెండు రోజులు పిల్లవాని ఏడుపు చూడలేక పాలిస్తే మా వాడు పాలు సాలక రాత్రిపూట ఒకటే ఏడుపు. రాత్రి నన్ను పండనీయడు, వాడు పండడు. పట్టిన చన్ను వదలడు.”

“ఈ ఒక్కపూట ఏదో నీ ముఖం చూసి పాలిస్తా. ఇక రాకు తమ్మీ” రంగనాయకమ్మ పిల్లవాణ్ణి తీసుకుని పాలిచ్చింది. చీకటి పడింది. కుక్కల అరుపులు, గాడిదల ఓండ్రలు. ఎవరి గుడిసెలో వాళ్లు దూరి తడికెలు వేసుకున్నారు. కోటప్ప పిల్లవాణ్ణి పక్కల వేసుకుని కుక్కి మంచంలో పడుకున్నాడు. ఎపుడో మధ్యరాత్రికి గాని నిద్రపట్టలేదు. పిల్లవాడు మాత్రం తాగిన పాల మత్తుతో కిక్కురుమనకుండా నిద్రపోయాడు.

✦ ✦ ✦

తెల్లవారింది. మళ్లీ ఎవరి వేషాలు వాళ్లు వేసుకుంటున్నారు. ఎవరు ఏ ఊరు పోవాలో తర్జనభర్జన పడుతున్నారు. ఏ ఊరెల్లినా ఎవరో ఒకరు వెళ్లాల్సిందే. పోటీ మాత్రం పడరు. ఒకరు వెళ్లిన ఊరికి ఇంకొకరు వెళ్లరు. ఇది వారి కుల కట్టుబాటు. చంటోడు లేచి ఒకటే ఏడుపు. పిల్లవాణ్ణి తీసుకుని ఓ సీసా నిండా నీళ్లు నింపి రబ్బరు చన్ను వాని నోట్లో పెట్టాడు. గబగబా తాగేశాడు పిల్లవాడు. భుజంమీద వేసుకుని నిద్రపుచ్చాడు. తన చిన్నప్పుడు తల్లిదండ్రులతో ఎన్ని ఊర్లు తిరిగాము. ఎన్ని నాటకాలు ఆడాము. ఎన్ని బొమ్మలాటలాడాము. ఏ ఊరు పోయినా మాది ముందాట అంటే మాదే ముందాట అని పోటీపడి ఆడించేవారు. రెడ్లు, కరణాలు, వెలమలు, కోమట్లు, చాకలి, మంగలి, గొల్లలు, గౌండ్లు పోటీలుపడి మరీ మరీ ఆటలు ఆడించేవారు. తమ తండ్రి తాతల వెంట ఏ పంట కల్లాలకు పోయినా కుండెడు, తూమెడు వడ్లు దానాలు పెట్టేవాళ్లు. తాగినంత కల్లు గౌండ్లు పోసేవాళ్లు. గొల్లలు గుంపుకో మేకనిచ్చేవారు. ఈ సినిమాలు, టి.వి.లు వచ్చి తమ పొట్టగొట్టాయి. తమ ఆట పాట వినే నాధుడే కరువయ్యాడు. బాలకృష్ణ వేషం తను ఎంచక్కా వేశాడు. తెల్లవారి ఎంతమంది ఆడవాళ్లు తననెత్తుకొని ముద్దాడారు. ఓహో! ఆ రోజులు ఇక రావు. తాము బొమ్మలాటలాడితే ఎంత బాగుండేది. తమ తాత రంగప్ప బొమ్మలాడిస్తుంటే తెర వెనుక తామంతా మద్దెల తాళాలు కొడుతుంటే ఎంతమంది చూసేవారు. బండ్ల మీద జనం ఒక ఊరి నుండి మరో ఊరికి వచ్చేవారు. బుడ్డ కేతిగాడు, బంగారక్కల బొమ్మలు ఆడిస్తుంటే జనం విరగబడి నవ్వేవాళ్లు. ఒక్కొక్కరికి కేతిగాడు బోల్‌బలా చెప్పేవాడు. వెంకట్‌రెడ్డి పటేల్ బోల్‌బలా, గొల్లపెద్ద మలయ్య బోల్‌బలా... ఇలా ఊరిపెద్దలందరికి నమస్కరించి బొమ్మలాట మొదలయ్యేది. తెల్లవారి తమకు బస్తాలకు బస్తాల వడ్లు పోటీపడి ఎడ్లబండ్ల మీద వేసుకుని తమ ఊరికి చేరవేసేవారు. ప్చ్! ఇక ఆ కాలం రాదు. పిల్లవాడు అటూ ఇటూ కదలసాగాడు. ఈ లోకంలోకి వచ్చిన కోటప్ప పిల్లవాణ్ణి మంచంలో వేసి జోకొట్టాడు. ఈ రోజు వీడికి పాలెట్లా సంపాదించాలి అని ఆలోచిస్తున్నాడు. అతని మెదడులో ఓ ఆలోచన తళుక్కున



మెరిసింది. ఎప్పుడో తన అయ్య మూలన పడవేసిన పాముల బుట్టలు బయటికి తీశాడు. కావిడికి ఓ వైపు పెద్ద పాముల బుట్ట, దాని మీద చిన్న బుట్ట, ఆపైన నాగస్వరం, కొన్ని తెల్ల ఉసిరి వేసుకున్నాడు. కావిడికి ఇంకోవైపు అన్నం గిన్నె, పాల సీసా జోలెలో వేసుకుని తగిలించాడు. నాగస్వరం చేతికి తీసుకున్నాడు. ముఖాన బొట్లు పెట్టుకున్నాడు. తలపాగా కట్టుకున్నాడు. చేతులకు కడియాలు, తాయెత్తులు కట్టుకున్నాడు. కోటప్ప తండ్రి నాటకాలు ఆట మానేశాక పాములు పట్టి ఆడించేవాడు. వాటి తోళ్లు అమ్మేవాడు. ఆ విధంగా అతనికి బాగానే గడిచింది. ఓ రోజు కొత్తగా పట్టి తెచ్చిన కోడెనాగు కోటప్ప తల్లిని కరిచి పొట్టన పెట్టుకుంది. తండ్రి ఆ రోజు నుండి పాములు పట్టి ఆడించటం మానివేశాడు. ఈ పాముల బుట్టలు, నాగస్వరం అన్నీ మూలపడే వున్నాయి. ఏ ఊరెళ్లినా అవి తవు వెంటే తిరుగుతున్నాయి. కోటప్ప నాగస్వరంతో పాముల బుట్టలతో ఊర్లోకి ప్రవేశించాడు. నాగస్వరం ఊదడం తన తండ్రి దగ్గర నేర్చుకున్నాడు. నాగస్వరం పాటకు జనం గుంపులు గుంపులుగా చేరుతున్నారు. ఉండి ఉండి ఓ పెద్దమనిషి "ఆ బుట్టలోని పాముని తీసి ఆడించరాదూ: ఇంత బాగా పాడుతున్నావు" అన్నాడు.

కోటప్ప గుండె గుభేలుమంది. పాముంటే గదా ఆడించటానికి. తమాయించుకున్నాడు.

"అమ్మో□! యిది కోడెత్రాచు దొరా! నిన్ననే మన వూళ్లోనే పట్టాను. కోరలు పీకలేదు. విషం తీయలేదు. నాలుగు రోజుల్లో ఆ పని చేసి ఆట నేర్పి మీ ముందు ఆడిస్తా."

"అవున్లే... చిన్న పిల్లలతో పని. అది పొరపాటున ఎవరినైనా కాటేస్తే ఇంకేమన్నా వుందా! వద్దులే... విషం తీశాక ఆడించు" ఇంకో పెద్దమనిషి సలహా.

"అమ్మా... తల్లీ! నాగన్నకు దండం పెట్టండ్రి. గిన్ని పాలు పోయండ్రి. మా నాగులుకు పాలు పోస్తే మీరు పుట్టలో పాలు పోసినంత పుణ్యమొస్తుంది తల్లీ"

"ఒరేయ్ నాగులూ! అమ్మగారిని, పిల్లలను, అయ్యగారిని చల్లగా వుండాలని దీవించరా"

నాగస్వరంతో బుట్టమీద కొట్టాడు. గడప గడపకు ఇవే మాటలు. తలా ఓ తెల్లుసిరి తాయెత్తిస్తున్నాడు.

"అమ్మా! ఈ తెల్లుసిరి, ఈ తాయెత్తు మీ దగ్గరుంటే మీ జోలికి ఏ పాము రాదు. ఇది పిల్లలకు కట్టురి తల్లీ. ఏ రోగము, నొప్పి రాదు."

కోటప్ప ఈ మాటలకు జనమంతా నమ్మారు. క్షణాలమీద కోటప్ప పాలసీసా నిండిపోయింది. వడ్లు, బియ్యంతో జోలె నిండింది. నాగరాజు కిష్టమని పాలు, గుడ్లు యిచ్చారు. తాయెత్తులకు, తెల్లుసిరికి డబ్బులిచ్చారు. కోటప్ప మనస్సు ఆనందంతో నిండిపోయింది. గబగబా గుడిసె చేరుకున్నాడు. పిల్లవానికి కడుపునిండా పాలు పట్టించాడు. గిన్నె నిండిన అన్నంతో తన కడుపు నింపుకున్నాడు. నిన్న తను వెళితే ఈసడించి తరిమేసిన జనం ఈ రోజు నాగరాజు పేరు చెబితే పాలతో ముంచెత్తారు. నిజం చెప్పి ఎంత బ్రతిమాలినా నమ్మని ఈ లోకం అబద్ధాన్ని ఎంత సులువుగా నమ్మింది. అమ్మా. తల్లీ.. పిల్లవాడు తల్లి లేనివాడు ఏడుస్తున్నాడంటే ఈసడించి ఈడ్చికొట్టిన ఈ జనం లేని పాముకు పాలు పోశారు. ఈ లోకం సంగతి కోటప్పకు అంతుపట్టలేదు. మనస్సులో నాగరాజుకు దండం పెట్టుకున్నాడు. ఆ రోజు నుండి కొడుకుకు "నాగులు" పేరు పెట్టి ముద్దుగా పిలుచుకున్నాడు. ●

## చేదు మాత్ర

భారంగా
ఈడ్చుకుంటూ-
భుజాన
చాకలి గాడిద
చావు మూట
హృదయాన
చేదెక్కిన
ఉప్పు సముద్రం
కఠినతరమవుతున్న
బతుకొక చేదుమాత్ర.

*- కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి*